[గత సంచిక తరువాయి]

రావ్ అండ్ రావ్ ఇంజనీరింగ్ వర్క్సులో వర్క్సు మేనేజర్‌గా చేరిన మనోహర్ ఆఫీసు పనిలో వెదుగుడు ఆడేస్తున్నాడుగాని ఇంటికొచ్చేసరికి తేలు కుట్టిన దొంగలా మిగిలిపోతున్నాడు. అలాగని ఫుడ్ దగ్గర, బెడ్ దగ్గర ఏ కొరతా రానివ్వడం లేదు. ఇంటి వద్ద వుంటే అతడికి ఎదురయ్యే సమస్యలు రెండు



# చిత్రకారుడు టి.వి.ప్రసాద్ రాసిన కథకి యర్రంశెట్టి శాయి చెప్పిన ముగింపు!

— అమృత అద్దం ముందు కూర్చోదు. తనకు వున్న చీరలు గుట్టా తీసుకొచ్చి అతడి ముందు పడేస్తుంది. తాను ఏ చీర కట్టుకోవాలో తీసి పెట్టమంటుంది. "ఫలానా తారీఖున మీరు రాసిన ప్రేమలేఖలో... నాకీ మ్యాచింగ్ బాగుంటుందని రాశారు. అందుకనే ఈ డ్రెస్ తీసుకున్నాను" అంటూ ఫ్లాష్ బ్యాక్‌తో తనను తికమకపెట్టే శ్రీమతిని సమాధాన పర్చలేక అతలాకుతలమయి పోతున్నాడు మనోహర్. వాస్తవానికి ఆడపిల్లల సైజులు, వేషధారణ ఇత్యాది అంశాలపై రాసిన వాక్యం రాయకుండా రాసి అమ్మాయిల్ని ఆనంద పారవశ్యంలో ముంచగల నేర్పు మనోహర్‌ది కాదు, చక్రధర్‌ది. "మీ ఏడవ లేఖలో... అదే మే 24న తేదీన, పిట్టలు ఆకాశాన ఎగబాకుతున్న వేళ రాసిన లేఖలో నా సైజులు 32 x 24 x ..." అంటూ ఏదో ఏదేదో చెబుతున్న అమృత మాటలు వినలేక, వినలేనట్టు కనబడలేక — తన భార్య ఎత్తుపల్లాల గురించి తన స్నేహితుడి వ్యాఖ్యానం వినలేక తల్లడిల్లిపోయాడు మనోహర్.

"భగవంతుడా! ఆడదానికి ప్రేమలేఖ రాయలేని వాడు — ఆడదాని చీర అందాన్ని మెచ్చుకోలేని వాడు మగవాడిగా పుట్టడం కన్నా మించిన పాపం లేదు; ఓ ఆడపిల్లను ప్రేమించడం కన్నా మించిన శిక్ష లేదు" అని బాత్రూములో సైలెంట్‌గా వాపోయేవాడు.

అంతకు మించి —

తలకు నూనె పెట్టుకుంటూ, "ఏమండీ, చేతులు బాగోలేదు. లాండ్రీ మనిషి వచ్చాడు. కొంచెం లిస్టు రాసిపెట్టండి..." అన్న శ్రీమతి ముఖంలోకి చూడలేక, తెల్ల కాగితం మీద కలం పెడితే తన దస్తూరీ గుట్టు రట్టవుతుందేమోనని, "అబ్బే... ఇప్పుడా... నేను అర్జంటుగా బాత్రూముకి వెళ్ళాలి" అంటూ బాత్రూము తలుపేసుకుని, సదరు లాండ్రీ మనిషి గేటు దాటాడని నిర్ధారించుకున్న తర్వాతే బయట కొచ్చేవాడు.

అంతే కాదు—

తన చేతి రాత అన్నది ఇంట్లో పొరపాటున కూడా కనిపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకునేవాడు. రెండు చేతులకి గోరింటాకు పెట్టుకుని, "ఏమండీ, నా చేతులు ఖాళీగా లేవు. ఇంట్లో సరుకులు నిండు కున్నాయి. కొంచెం లిస్టు రాయండి..." అనడుగుతున్న భార్య ముఖంలోకి తెల్లమొహం వేసుకుని చూడడం మానేశాడు. వెంటనే పోర్టబుల్ ఇంగ్లీషు టైప్ రైటర్ తీసుకొచ్చి, "ఇప్పుడు చెప్పు..." అని కూర్చోవడం ప్రారంభించాడు. "బాగుందిలే సంబరం... పచారీ కొట్టువాడికి ఇంగ్లీషు అర్థమవుతుందా" అంటూ బలవంతాన వైట్ పేపర్ తీయించేది.

ఈ సమస్యకి పరిష్కారమేమిటో బోధపడలేదు. ఎంత కాలమిలా దొంగాట ఆడాలో అర్థం కాలేదు మనోహర్‌కి. అసలు విషయం అమృతకి చెబితే? అన్న ఆలోచన కూడా రాకపోలేదు. కాని తొలి రాత్రి అమృత చెప్పిన విషయం గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం మానుకున్నాడు. కాని ఆ సమస్య మాత్రం అతణ్ని ప్రశాంతంగా బ్రతకనివ్వడంలేదు.

* * *

ఫోను రిసీవర్ అందుకున్న అమృత ఆకులా కదిలిపోయింది. ఆమెను అంతగా కుదిపిన విషయం — ఫ్యాక్టరీలో మనోహర్ ప్రమాదానికి గురయ్యాడు! ఇప్పుడతడు హాస్పిటల్‌లో వున్నాడు!!

హుటాహుటిన హాస్పిటల్ చేరుకున్న అమృత భర్తని చూసి బావురుమన్నది.

"పిచ్చీ... ఇప్పుడేమయిందని, కుడి చేయి వేలొకటి తెగింది. అంతే గదా..." అంటూ భార్యని రెండవ చేత్తో దగ్గరకు తీసుకున్నాడు.

"ఇప్పుడు వేలయింది. రేపు చేయి అవుతుంది. అయినా మిషన్ల దగ్గరికి మీరెందుకు వెళ్ళారండీ... పైపెచ్చు ఈ మధ్య కాలంలో ఏటియస్ ఇంజక్షన్ కూడా తీసుకున్నట్టు లేరు..."

"ఆ భయమేమీలేదు... ముందు ఏటియస్ ఇంజక్షన్ తీసుకునే ఆఫీసుకొచ్చాను"

"ఏమోనండీ... ముందు మీరీ ఉద్యోగం మానండి" అంటూ కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న భార్యని చూసి తట్టుకోలేక పోయాడు మనోహర్.

'ఛీ... ఈ అమాయకురాల్నా నేను మోసం చేస్తున్నది' అనుకున్నాడు అతడిలోని ప్రియుడు.

"అమృతా..." అంటూ పిలిచాడు.

అంత ఏడుపులోను 'ఏమిటి...' అన్నట్టుగా చూసింది.

"నీవు నన్ను క్షమించాలి అమృతా..."

ఏడుపు మొహంతో వున్న అమృతకి అతడి మాటలు అర్థం కాలేదు.

"నిజం అమృతా— —ఇది యాక్సిడెంట్ కాదు. నేను కావాలనే కుడిచేయి మధ్య వేలు కోసుకున్నాను."

"మీరేమన్నా ఏకలవ్యుడు అనుకున్నారటండీ— కోసుకోవడానికి..." అంటూ తన సహజ ధోరణిలో మందలిస్తున్న అమృత వాక్ప్రవాహానికి ఆనకట్ట వేస్తూ అన్నాడు.

"నిజం అమృతా— నీ కోసమే నేనీ పని చేశాను. నేను నిన్ను ప్రేమించాను. నీవు లేనిదే నేను బ్రతకలేను. కానీ నీవు నా చేతి వ్రాతను ప్రేమించావు. నా ప్రేమ లేఖలోని భాషను ప్రేమించావు. నాది కాని ఆ రెంటినీ ప్రేమించిన నీకు నిజం తెలిస్తే... ఆ తర్వాత ఏం జరుగు తుందో ఊహించలేకపోయాను. నీవు మాటి మాటికీ అది రాయండి, ఇది రాయండి అంటూ నా హ్యాండ్ రైటింగ్‌కి టెస్టు పెడుతున్నావు. పై పెచ్చు టైప్ మిషన్ కూడా వాడనివ్వడంలేదు. అందుకే నేను ఈ వేలు కోసేసుకున్నాను..."

అమృత ముఖంలో ఆనందం, అంతకు మించిన చిరు కోపం చోటుచేసుకున్నాయి.

"పిచ్చీ..." అంటూ లాలనగా తల నిమిరింది. ఆ తర్వాత అన్నది — "అడోలెసెన్సు లవ్‌కి, లైఫ్‌కి చాలా తేడా వుంది. క్లాసులలో ఫస్టు మార్కొచ్చిన స్టూడెంట్‌ని, చేతి రాత అందంగా వున్న కుర్రవాణ్ణి, తన అంద చందాల్ని అద్భుతంగా పొగిడే రోమియోని ఆడపిల్ల ఇష్టపడుతుంది. అదంతా అడోలెసెంట్ లవ్. కాని జీవితంలో భర్తగా ఎంచుకునే వ్యక్తిలో అసలైన క్వాలిఫికేషన్స్ వున్నాయో, లేదో చూస్తుంది. సమాజంలో స్టేటస్, భర్తగా అతడు భార్యని ఎంతగా సుఖపెట్టేది, అతడి ఆస్తి పాస్తులు — ఇవన్నీ లెక్కలోకి వస్తాయి. తన అందచందాల్ని పొగుడ్తూ ఎవడో ప్రేమలేఖ రాస్తే వాడే నా మొగుడని ఏ ఆడపిల్లా ఊరేగదు.

"మరొక విషయం — మన పెళ్ళయిన కొత్తలో మన ఇంటికి మీ పేరున ఓ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం మీద అడ్రసు — నాకు మీరు రాసిన లేఖలు ఒకే దస్తూరితో వుండడం చూసి మీకు మీరే ఉత్తరం రాసుకున్నారా? అన్న అనుమానంతో కవరు తెరిచాను. అప్పుడు చేతి రాత విషయం అర్థమయింది. ఆ రోజు నుంచి మిమ్మల్ని ఏడిపించడానికే అలా చేశాను. అంతేగాని మీరు చేతులు, పీకలు తెగ్గోసుకుంటారని కాదు."